నేడు పాఠశాలల్లో నిరసన ప్రదర్శన

మాట్లాడుతున్న మురళీమోహన్

పాల్వంచ, జనవరి 19: తుక్కుగూడ హైస్కూల్ హెచ్ఎం రాములుపై దాడిని నిరసిస్తూ, దుండగులను కఠినంగా శిక్షించాలన్న డిమాండుతో పాఠశాలల్లో సోమవారం ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ పిలుపునిచ్చారు. పాల్వంచలోని ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల నిర్వహణలో అరాచక శక్తుల జోక్యంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎం రాములుపై దాడికి నిరసనగా సోమవారం భోజన విరామ సమయంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రదర్శన నిర్వహించాలని కోరారు. నాయకులు వెంకటేశ్వర్లు, యాకూబ్ పాషా, విజయభాస్కర్, హరిసింగ్, అంబిక జాదవ్, సత్యశ్రీ, ఎం.రాజులు, నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు, వీటీఆర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

కొత్తగూడెం టౌన్, జనవరి 19: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన 'ప్రజావాణి'ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సర్వేలో జిల్లా అధికార యంత్రాంగమంతా నిమగ్నమైనందున రద్దు చేసినట్లు వివరించారు. దీనిని ప్రజలంతా గమనించాలని, అర్జీలు ఇవ్వడానికి ఐడీఓసీ కార్యాలయానికి రావొద్దని కోరారు.

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

భద్రాచలం, జనవరి 19: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయాలని తెలిపారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

టేకులపల్లి, జనవరి 19: బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం సోమవారం ఉదయం 10:00 గంటలకు మండలంలోని బేతంపూడి పంచాయతీ వెంకిట్యాతండాలో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్ తెలిపారు. ఆదివారం టేకులపల్లిలో ఆయన మాట్లాడుతూ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుగు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ హాజరవుతారని, సమావేశంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి వార్డు సభలు

కొత్తగూడెం అర్బన్, జనవరి 19: ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా దరఖాస్తుదారుల్లో అర్హులను ఎంపిక చేసేందుకు వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీన 1, 5, 15, 16, 31, 33, 2, 6, 17, 34 వార్డుల్లో, 22వ తేదీన 3, 7, 18, 22, 4, 8, 19, 32, 35, 36 వార్డుల్లో; 23వ తేదీన 9, 13, 20, 27, 10, 14, 21, 23, 24, 28 వార్డుల్లో; 24వ తేదీన 11, 24, 29, 12, 26, 30 వార్డుల్లో సభలు ఉంటాయని వివరించారు.

రేపటి నుంచి గ్రామసభలు

అశ్వారావుపేట రూరల్, జనవరి 19: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై మంగళవారం నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటినుంచి ఇల్లెందులో..

ఇల్లెందు రూరల్, జనవరి 19: ప్రభుత్వ చేపడుతున్న నాలుగు సంక్షేమ పథకాల అమలులో భాగంగా మండలంలో మంగళ, బుధ, గురువారాల్లో గ్రామసభలు న్విహించనున్నట్లు ఎంపీడీవో ధన్‌సింగ్ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాఘవ నిలయంలో వేమన జయంతి

భద్రాచలం, జనవరి 19: పట్టణంలోని రాఘవ నిలయంలో ప్రజాకవి వేమన జయంతిని రాఘవ నిలయం రెడ్డి అసోసియేషన్ బాధ్యులు ఆదివారం నిర్వహించారు. తొలుత రాఘవ నిలయం కార్యదర్శి రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గాదె మాధవరెడ్డి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేమన పద్యాల రూపంలో ప్రజలందరూ సన్మార్గంలో, దైవభక్తిలో బతికేందుకు విలువలు నేర్పిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు దారా బాలాజీరావు, మోతుకూరి వీరయ్య, యశోద రాంబాబు, మెడికల్‌షాపు మధు, షేక్ అజీమ్, శ్రీధర్‌రెడ్డి, విద్యాసాగర్, చలపతిరావు, మేనేజర్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం విజయవంతం

దుమ్ముగూడెం, జనవరి 19: మండల కేంద్రమైన లక్ష్మీనగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భద్రాచలం నేతాజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఆర్థో వైద్యులు హేమంత్ కాకర్ల రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. చిన్నపిల్లల వైద్యులు వై రాజశేఖరరెడ్డి, జనరల్ వైద్యులు సుకన్యరెడ్డి 250 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. నిర్వాహకులు జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నర్సింహారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన

బూర్గంపహాడ్, జనవరి 19: మండలంలోని సారపాక బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించింది. మండలంలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు రిపబ్లిక్‌డే నాడు కళాశాల ఆవరణలో బహుమతులు అందజేస్తామన్నారు.

బీఆర్ఎస్ నేత రమేశ్‌కు నివాళి

ఇల్లెందు, జనవరి 19: పట్టణ బీఆర్ఎస్ నాయకుడు, ఆరో వార్డు కౌన్సిలర్ తోట లలిత శారద భర్త తోట రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య రమేశ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ పాషా, నాయకులు దొడ్డ డానియేల్, బొల్లా సూర్యం, మడుగు సాంబమూర్తి, చిల్ల శ్రీనివాస్, కౌన్సిలర్ పత్తి స్వప్న, కమల్ కోరి, శంకర్, రేనగంటి శ్రీను ఉన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కమిటీ ఏర్పాటు

కొత్తగూడెం అర్బన్, జనవరి 19: లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా కమిటీని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నియమించింది. కన్వీనర్‌గా నూనావత్ బాలాజీనాయక్, కో-కన్వీనర్‌గా గుగులోత్ మోహన్ నాయక్ నియమితులయ్యారు. వీరికి నియామక పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ అందించారు.

అలంకార ప్రాయంగా సెంట్రల్ లైటింగ్

- అంధకారంలో మణుగూరు పట్టణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మణుగూరు టౌన్, జనవరి 19: రహదారుల విస్తరణతో పాటు డివైడర్, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసి పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నియోజకవర్గ కేంద్రాల రూపురేఖలు మార్చేసింది. ఆంధ్రాపాలకుల హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని పట్టణాలను సుందరీకరించేందుకు ప్రత్యేక నిధులను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అభివృద్ధి ఉరకలు వేసింది. అందులో భాగంగానే మణుగూరు పట్టణ ప్రధాన రహదారి సురక్షా బస్టాండ్ నుంచి సాయినగర్ ప్రాంతం టెలీఫోన్ ఎక్స్చేంజ్ వరకు, అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు కోట్లాది రూపాయలతో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసింది. అయితే నాటి పాలకుల హయాంలో వెలుగులు విరజిమ్మిన సెంట్రల్ లైటింగ్ ప్రస్తుత పాలనలో అలంకార ప్రాయంగా మారాయి. పట్టించుకునే నాధుడు లేకపోవడంతో అవి వెలగక అంధకారం అలముకుంది. మాజీ విప్, ప్రస్తుత బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హయాంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

పట్టణ అభివృద్ధిలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ డివైడింగ్, సైడ్ డ్రైన్స్ నిర్మాణాలకు సుమారు రూ.20 కోట్లు నిధులను మంజూరు చేయించి పనులను పూర్తి చేయించారు. గతేడాది కాలంగా ఈ సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ విద్యుత్ కాంతులతో వెలుగులు విరాజిమ్మాల్సిన పట్టణ ప్రధాన రహదారి అధికారుల నిర్లక్ష్యం, ప్రస్తుత పాలకుల ఉదాసీన వైఖరి వల్ల ఏడాది కాలంగా అంధకారంలో మగ్గిపోతోంది. సెంట్రల్ లైటింగ్ కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

చిమ్మచీకటిగా ఉంటోంది

పట్టణంలోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సరిగా వెలగడం లేదు. దీంతో చిమ్మచీకటిగా ఉంటోంది. ఇది పట్టణ కేంద్రమైనా అనే అనుమానాలు వస్తున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రహదారి మీదనుంచే అందరూ ప్రయాణిస్తున్నా కానీ దృష్టి సారించడం లేదు. వెంటనే మరమ్మతులు చేయించాలి.

– కానూరి నగేశ్, మణుగూరు

ఏడాదిగా వెలగడం లేదు

పట్టణంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఏడాది కాలంగా వెలగడం లేదు. అధికారులకు చెప్పినా కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో వెలుగులు విరజిమ్మిన సెంట్రల్ లైటింగ్ ఇప్పుడు అలంకార ప్రాయంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– సీహెచ్ రవికుమార్, మణుగూరు

సాగు భూముల సర్వే పూర్తి: తహసీల్దార్

అశ్వారావుపేట రూరల్: వేదాంతపురంలో సర్వే చేస్తున్న అధికారులు

అశ్వారావుపేట, జనవరి 19: మండలంలో చేపట్టిన సాగు భూముల సర్వే పూర్తయిందని తహసీల్దార్ పీ.కృష్ణ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి శివరాం ప్రసాద్ తెలిపారు. ఆదివారం అశ్వారావుపేటలో విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 98.27 ఎకరాలు సాగులో లేని భూములను గుర్తించినట్లు చెప్పారు. మొత్తం 4 వ్యవసాయ క్లస్టర్లు, 19 రెవెన్యూ గ్రామాలు, 130 సబ్ డివిజన్లతో 37,071 ఎకరాలు సాగు భూములు ఉన్నాయని పేర్కొన్నారు. లే అవుట్లు, గృహాలు, పలు రకాల వ్యాపార సముదాయాలతో వ్యవసాయేతర భూములుగా 98.27 ఎకరాలు రెవె న్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త సర్వేలో నిర్ధారించామని చెప్పారు. ఇందులో అశ్వారావుపేటలో 32.72 ఎకరాలు, ఆసుపాకలో 40.55 ఎకరాలు, నారాయణపురంలో 12.10 ఎకరాలు, మద్దికొండలో 7.06 ఎకరాలు, నారంవారిగూడెంలో 3.07 ఎకరాలు, గుంటిమడుగులో 1.10 ఎకరాలు, రామన్నగూడెంలో 1 ఎకరం, వేదాంతపురంలో 1.10 ఎకరాల భూమి ఉందని స్పష్టం చేశారు. వారి వెంట గిర్దావర్లు కృష్ణ, పద్మావతి, ఏఈవో సతీశ్, షకీరా భాను ఉన్నారు.

వేదాంతపురంలో..

అశ్వారావుపేట రూరల్, జనవరి 19: మండలంలోని వేదాంతపురం గ్రామంలో ఏఈవో షాకీరా భాను, సర్వేయర్ నాగరాజు గ్రామంలో సాగుకు యోగ్యమైన వ్యవసాయ భూములను పరిశీలించారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

దమ్మపేట మండలంలో..

దమ్మపేట, జనవరి 19: మండలంలో ప్రభుత్వ పథకాల అమలు కోసం అధికారులు ఆదివారం సర్వే చేశారు. రేషన్‌కార్డులపై ఇంటింటికెళ్లి ఆయా పంచాయతీల కార్యదర్శులు రేషన్‌కార్డుల్లో కొత్త వారి పేర్లు, కొత్తకార్డుల జారీపై సర్వే చేస్తున్నారు. ఎంపీవో రామారావు మాట్లాడుతూ సర్వే తుది నివేదికను గ్రామాల్లో గ్రామసభల ద్వారా వెల్లడించడం జరుగుతుందని, ఎవరైనా రేషన్‌కార్డు జాబితాలో పేర్లు రాకపోతే వారంతా గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

25 నుంచి సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు

దమ్మపేట, జనవరి 19: ఈనెల 25 నుంచి 28వ తేదీవరకు సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం మండలంలోని మొద్దులగూడెంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, కొలికపోగు శ్రీనివాసరావు, నభి పాల్గొన్నారు.

కారు ఢీకొని వలస కూలీ మృతి

జూలూరుపాడు, జనవరి 19: ప్రధాన రహదారిని దాటుతున్న వలస కూలీ.. కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మండలంలోని సాయిరాం తండా సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మిర్చి కోతల కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు మండలలోని సాయిరాం తండాకు వచ్చారు. బుదు(48) అనే వలస కూలీ, ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారపాక పుష్కరవనాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

బూర్గంపహాడ్, జనవరి 19: సారపాకలోని పుష్కరవనాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండల వాసులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు ఇతర జిల్లాల నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారని, అయితే వసతి సదుపాయంలేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో భద్రాచలానికి దగ్గరలో ఉన్న సారపాకలోని పుష్కరవనాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి కాటేజీల నిర్మాణం చేపడితే భక్తులు, పర్యాటకులకు ఈ ప్రాంతం ఎంతో సౌకర్యవంతం గా ఉంటుందని ఆ వినతిలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సారపాక పుష్కరవనం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడి నిధులు సమకూర్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ రంగ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

భద్రాచలం, జనవరి 19: విద్యుత్ రంగ కార్మికులు ప్రజలకు, రాష్ట్ర ప్రగతికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరరావు అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీ.కుమారాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్, జాయింట్ సెక్రటరీ బొల్లి వెంకటరాజు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ చంద్రారెడ్డి, వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు ఎం.ప్రసాద్, కే.మధు సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు స్వప్న, వెంకటేశ్వరరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 19: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

పర్ణశాలలో రామకీర్తనలు

పర్ణశాల, జనవరి 19: ఇస్కాన్ స్వామీజీ ప్రణవానంద దాస్ ప్రభుజీ పర్ణశాల రామ య్య దర్శనం కోసం వారి భక్త బృందం 300 మందితో విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం పర్ణశాల కుటీరం, నారచీరెల ప్రాంతం అన్ని దర్శించి స్థల పురాణం తెలుసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వారి ప్రవచనం చేసి రామ కీర్తనలతో భజనాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు సాయిబాబా, ఇన్‌చార్జి అనీల్‌కుమార్, శేషం కిరణ్‌కుమార్ చార్యులు, భార్గవాచార్యులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు రక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలి

మాట్లాడుతున్న కోటంరాజు

బూర్గంపహాడ్, జనవరి 19: భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు రక్షణ కోసం పోరాటాలకు సిద్ధంకావాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పెయింటర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పతల నర్సింహారావు, సగ్గెం శ్రీను, తోట మల్లయ్య, సీహెచ్.రమణయ్య, ఓర్పు పండు, వెంకన్న, చందు, కోటయ్య, స్వామి పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లు అందజేత

భద్రాచలం, జనవరి 19: పట్టణానికి చెందిన జగపతికి భద్రాచలం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం రోటరీక్లబ్ సహకారంతో రెండు కృత్రిమ కాళ్లను ఆదివారం రోటరీ బాధ్యులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, విద్యాసాగర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 23న ఉదయం 9 గంటల నుంచి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం క్లబ్ సహకారంతో కృత్రిమ కాళ్లు అందజేసే శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రమాదవశాత్తు కాళ్లు కోల్పోయిన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నామిని అజీం, ఫాస్ట్ ప్రెసిడెంట్ యశోద రాంబాబు, వీరయ్య, సుధాకర్‌రెడ్డి, మధుసూదనరావు, రఫీ, సభ్యులు బందు నర్సింహారావు, వెంకటస్వామి, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చలపతి పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాటు

ఇల్లెందు, రూరల్ జనవరి 19: గణతంత్ర దినోత్సవ వేడుకలను సింగరేణి అధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు ఏరియా జీఎం వీ.కృష్ణయ్య సూచించారు. అదివారం జీఎం కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను స్థానిక రన్స్ అండ్ గోల్డ్ స్టేడియం, 24 ఏరియాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు సన్మానిస్తామన్నారు. సమావేశంలో అధికారులు నర్సింహరాజు, రామస్వామి, నాగరాజు, కృష్ణమోహన్, జీవి మోహన్‌రావు, వెంకటేశం, ధనుంజయరెడ్డి, దిలీప్ కూమార్, అంజీరెడ్డి, రామదాసు, మధుబాబు, సుధాకార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శించిన మెచ్చా

దమ్మపేట, జనవరి 19: మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మండలంలో ఆదివారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న పోతినేని వెంకట్రావు, కక్కిరాల రత్నాకర్‌రావు నివాసాలకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నాయకులు రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, రాంబాబు, రవి, గాజుబోయిన ఏసుబాబు, జలగం వాసు, పాకనాటి శ్రీను, యార్లగడ్డ శ్రీను, రూపా రాంబాబు, గణేశ్, మనోజ్, ఏసుబాబు, జిన్నా ఉన్నారు.

ఆటో యూనియన్ ఎన్నిక

చండ్రుగొండ, జనవరి 19: చండ్రుగొండ-జూలూరుపాడు రోడ్డు అడ్డా ఆటో యూనియన్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ కమిటిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇనుముల పిచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా హనుమంతరావు, కోశాదికారిగా జగన్నాథం, గౌరవ అధ్యక్షుడిగా రెడ్డిపోగు రవి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే అన్వర్, సహాయ కార్యదర్శిగా బషీర్‌అహ్మద్, ఆర్గనైజర్‌గా జగదీశ్‌ను ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి

టేకులపల్లి, జనవరి 19: మండలంలో ఉన్న భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం మండలంలోని సులానగర్ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సులానగర్, ముత్యాలంపాడు క్రాస్ రోడ్, టేకులపల్లి, బేతంపూడి రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న భూ సమస్యల పరిష్కరిస్తానన్నారు.

పాల్వంచ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన

పాల్వంచ, జనవరి 19: పాల్వంచ పోలీసు స్టేషన్ ఎదుట సేవాలాల్ సేన బాధ్యులు ఆదివారం రాత్రి ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుమార్తెను ఓ యువకుడు కిడ్నాప్ చేశాడంటూ ఓ యువతి తల్లిదండ్రులు ఈ నెల 16న చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. ఆ యువకుడిని, యువతిని గుర్తించి ఆదివారం రాత్రి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సేవాలాల్ సేన బాధ్యులు.. యువకుడి తరపున స్టేషన్ వద్దకు వచ్చారు. వందల సంఖ్యలో చేరుకొని ధర్నా చేపట్టారు. దీంతో పోలీసులు స్పందించి వారిని వారించారు. తర్వాత ఇటు యువతీయువకులకు, అటు యువతి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ సతీశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. యువతీయువకులు మేజర్లని, వారిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తామని తెలిపారు. ఎస్ఐలు సుమన్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పురుగు మందు తాగి యువకుడి మ